# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివర్ణించారు.
- రాష్ట్రంలో గంజాయి, మత్తుపదార్థాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ని ఏర్పాటు చేస్తున్నట్లు హోమ్ మంత్రి వంగల పూడి అనిత తెలిపారు.
- ప్రభుత్వ ఆసుపత్రులను పూర్తి స్థాయి సదుపాయాలతో తీర్చిదిద్దుతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.
- ఐటీడీఏ, ఐసీడీఎస్ విభాగాలను ప్రక్షాళన చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన వ్యవహారాల శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు.
- రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మరింత బలంగా ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

==============================

రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్ట్ జీవనాడి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టును అధికారులతో కలిసి ముఖ్యమంత్రి ఈ రోజు సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ, 2019లో తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి 72 శాతం పనులు పూర్తయితే గత ఐదేళ్లలో ఒక్క అడుగు ముందుకు పడలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయితే ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకే కాదు, కరవు ప్రాంతమైన రాయలసీమకు కూడా నీటిని అందించే వెసులుబాటు ఉండేదని పేర్కొంటూ..

(వాయిస్ 22 సెకన్లు)

==============================

ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఈ రోజు  పోలవరం ప్రాజెక్ట్  ప్రాంతానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. మంత్రులు  నిమ్మల రామానాయుడు కొలుసు పార్ధసారధి, కందుల దుర్గేష్ లతో పాటు ఏలూరు లోక్ సభ సభ్యుడు పుట్ట. మహేష్ యాదవ్, శాసనసభ్యులు చిర్రి. బాలరాజు, బడేటి.రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు పలికిన వారిలో  ఉన్నారు.

==============================

రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తుపదార్ధాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ని  ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగల పూడి అనిత తెలిపారు. విశాఖలో  ఈ రోజు ప్రభుత్వ అతిధి గృహంలో పోలీస్ ఉన్నతాధికారులతో మంత్రి  సమీక్ష సమావేశం నిర్వహించారు.  అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మూడు నెలల వ్యవధిలో గణనీయమైన  మార్పు తీసుకువస్తామని అన్నారు.  విశాఖల కేజిహెచ్ లో డీ అడిక్షన్ కోసం ఒక బ్లాక్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అదే  విధంగా గంజాయి,  మత్తుపదార్ధాల స్మెల్ డిటెక్షన్ల కోసం డాగ్ స్క్వాడ్ లను పెంచుతామని అన్నారు.  ఇదిలా  ఉండగా ట్రాఫిక్ పోలీసులు సైతం ఈవ్ టీజింగ్ చేసేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించినట్టు  హోమ్ మంత్రి  తెలిపారు. ఈ  సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున, విశాఖ  నగర  పోలీస్ కమిషనర్  రవి శంకర్  తదితరులుపాల్గొన్నారు.

==============================

రాష్ట్రంలో ఐటీడీఏ, ఐసీడీఎస్ విభాగాలను  పూర్తిస్థాయిలో  ప్రక్షాళన చేస్తున్నట్లుగా మహిళా, శిశు సంక్షేమం, గిరిజన వ్యవహారాల శాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని తన చాంబర్ లో  ఈ రోజు మంత్రిగా  ఆమె బాధ్యతలు స్వీకరించారు.  ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలలలో ఏఎన్ఎంలను నియమిస్తున్నామని తెలిపారు. గిరిజన పాఠశాలలలో  డ్రాపౌట్లు  నివారిస్తామని చెప్పారు. గిరిజన పిల్లలు బడులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూస్తామని అన్నారు. అలాగే, అంగన్వాడీ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని మంత్రి వెల్లడించారు.

==============================

రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో  జరుపుకున్నారు.  ముఖ్యమంత్రి నారా  చంద్రబాబు నాయుడు ముస్లిం మైనారిటీ సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని పలువురు ముస్లిం సంఘాల నేతలు, గుంటూరు జిల్లాలోని ఉండవల్లి నివాసంలో కలసి, ప్రార్ధనలు నిర్వహించారు. కాగా విశాఖ జిల్లా, అలాగే పశ్చిమగోదావరి జిల్లాల్లోని  పలు మసీదుల్లో  ముస్లింలు  ప్రార్ధనలు నిర్వహించారు.  అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

==============================

పశ్చిమ బెంగాల్‌లో ఈ రోజు జరిగిన ఘోర రైలు ప్రమాదంపై ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధాకరమని ప్రధాని సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారికి సంతాపం తెలిపిన ఆయన  గాయ పడిన వారు  త్వరగా కోలుకోవాలని ప్రార్ధించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాని అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అదే విధంగా ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను  ప్రకటించారు.  మృతుల బంధువులకు ఈ మొత్తాన్ని అందజేస్తారు. ఇక గాయపడిన వారికి 50 వేల రూపాయలు అందజేయనున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన అన్ని సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతిలోని ప్రభుత్వ రుయా ఆసుపత్రిని ఈరోజు మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగంతో పాటు రోగులు చికిత్స పొందుతున్న పలు వార్డులను పరిశీలించారు. వైద్య సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతీ రైతుకు విత్తనాలు అందేలా చూస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. రైతులకు రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా గజపతినగరం మార్కెట్ యార్డులో ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులు విత్తనాల కోసం ఎటువంటి ఇబ్బందీ పడకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా అవసరాలకు సరిపడేవిధంగా విత్తనాలను సమకూర్చాలని వ్యవసాయ శాఖను కోరారు. ఎరువులు, యూరియా కూడా పంపిణీకి సిద్ధంగా ఉందని అవసరమైన వారు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ పోర్ట్ అద్భుత పని తీరు కనపరచడం పట్ల భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత జీవీఎల్ నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. 2023 సంవత్సరానికి తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్ లో విశాఖ పోర్ట్ అథారిటీ 62.29 ఇండెక్స్ పాయింట్లతో 20 వ స్థానాన్ని అలాగే, కంటైనర్ పోర్ట్ పనితీరు సూచికలో 19వ స్థానాన్ని సాధించింది. దేశంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 12 ప్రధాన ఓడరేవుల్లో ఒకటైన విశాఖ పోర్టు అథారిటీ అత్యుత్తమ పనితీరు సాధించడం విశాఖకు గర్వకారణమని జీవీఎల్ నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే నాలుగు రోజులలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మరింత బలంగా ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న రెండు మూడు రోజులలో ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటినుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. అదే విధంగా దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి జిల్లాకు వచ్చిన ఆయన అనంతపురం సరిహద్దుల్లోని గుత్తి పట్టణం వద్ద బాట సుంకలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నెల్లూరు నగరంలోని ప్రసిద్ధ శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు లోక్ సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లతో కలిసి ఆయన ఈ రోజు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆలయంలోని అద్దాల మండపాన్ని ఆధునీకరిస్తామని అన్నారు. పడమర వైపున ఉన్న ఘాట్ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేస్తామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో గంజాయిని అరికట్టాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు రాష్ట్ర ఐటీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ రోజు బక్రీద్ పండుగ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలోని స్థానిక ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, గంజాయి పై తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామని తెలిపారు. కాగా, మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు ఉత్తరప్రదేశ్ నుంచి గ్రాండ్ కిసాన్ సమ్మేళన్ లో విడుదల చేసే 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధిని కార్యక్రమాన్ని తిరుపతి ప్రజలు వీక్షించేలా అతి పెద్ద తెరలను ఏర్పాటు చేస్తున్నట్లు రాస్ స్వచ్ఛంద సంస్థ సీనియర్ సైంటిస్ట్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =